ప్రజాశక్తి
శనివారం 19 ఏప్రిల్, 2025
5
శ్రీకాకుళం



ఎక్సైజ్ స్టేషన్ సందర్శన

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో జరిగిన నేరాలపై సమీక్షించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నాటుసారా నిర్మూలనకు నిర్వహిస్తున్న నవోదయం 2 కార్యక్రమంపై ఆరా తీశారు. కార్యక్రమంలో సిఐ కె.బివి పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ఏదీ సన్నద్ధత?

- ఏడాది కాలంగా నిర్వహించని ఐఎబి సమావేశం
- అపరిష్కృతంగానే సాగునీటి సమస్యలు
- పూడికతో నిండిపోయిన పంట కాలువలు
- గతేడాది జూలైలో హడావుడిగా పనులు
- శివారు భూములకు అందని సాగునీరు



తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగు నీరు ప్రవహించే ఓనిగెడ్డ కాలువ దుస్థితి

మరికొద్ది వారాల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. సాగునీటి సమస్యలపై ముందుగానే దృష్టిసారిస్తే కొంత మేర అయినా అన్నదాతల వెతలు తీరుతాయి. లేకుండా గతేడాది అనుభవాలే పునరావృతమయ్యే అవకాశాలు లేకపోలేదు. సాగునీటి సమస్యలు, విత్తనాలు, ఎరువుల పంపిణీ తదితర అంశాలపై చర్చించేందుకు ఏడాదికొకసారి సాగునీటి సలహా మండలి (ఐఎబి) సమావేశం కావాల్సి ఉంది. గతేడాది ఎన్నికల సీజన్ కావడం, టిడిపి కూటమి ప్రభుత్వం కొత్తగా ఏర్పడటం వంటి కారణాలతో సమావేశం నిర్వహించలేదు. సీజన్ ప్రారంభానికి ముందే సమావేశం నిర్వహిస్తే కొన్ని సమస్యలకు పరిష్కారం దొరికే అవకాశం ఉంది. పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులకు అవసరమైన ప్రతిపాదనలు, నిధుల కేటాయింపు వంటి అంశాలపై చర్చించేందుకు వీలుపడుతుంది. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో సహా ఇతర ప్రజాప్రతినిధులు వీటిపై దృష్టి సారించాల్సి ఉంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడికాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందివ్వాల్సి ఉంది. కాలువల పరిస్థితి దయనీయంగా ఉండటంతో నిర్దేశించిన ఆయకట్టుకు నీరందడం లేదు. ముఖ్యంగా శివారు భూములకు నీరందని పరిస్థితి ఏటా పునరావృతమవుతోంది. సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండటం, కాలువల్లో పెద్ద ఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండటంతో 1800 క్యూసెక్కులకు మించి నీరు విడిచి పెట్టలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా, 500 క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. గతేడాది జూలైలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు వంశధార కాలువ మట్టి నాసిరకంగా ఉండటంతో గొట్టాబ్యారేజికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఎలకల మెట్ట సమీపంలో కొంత గట్టు కొట్టుకుపోయింది. ఈ అనుభవాల నేపథ్యంలో ఈ ఏడాది నీటి ప్రవాహాన్ని కాలువ గట్లు ఎంతవరకు తట్టుకుంటాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఖరీఫ్ సీజన్ ముగిసిన తర్వాత గుర్రపుడెక్క తొలగింపు

పంట కాలువల్లో ఈ ఏడాది పూడికతీత పనులు చేపట్టకపోవడంతో శివారు భూములకు నీరందించే పరిస్థితి కనిపించడం లేదు. పంట కాలువల్లో పెద్ద ఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోయింది. గతేడాదీ పనులు చేపట్టకపోవడంతో ఎడమ కాలువ పరిధిలోని పోలాకి, నరసన్నపేట, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని చాలా గ్రామాలకు సాగునీరందలేదు. కుడి కాలువ పరిధిలోని గార మండలంలో పంటలు ఎండిపోయిన పరిస్థితులు తలెత్తాయి. నీటిని విడిచిపెట్టే సమయానికే గుర్రపుడెక్క తొలగించాల్సి ఉండగా, గతేడాది అక్టోబరు తర్వాత పనులు చేపట్టారు. దీంతో శివారు భూములకు సాగు నీరందక పంటలు ఎండిపోయాయి.

శిథిలావస్థలో షట్టర్లు

వంశధార శివారు భూములకు షట్టర్ల కుంభకోణం కేసు అడ్డంకిగా మారింది. 2009లో సిఐడి నమోదు చేసిన కేసుపై కోర్టులో విచారణ కొనసాగుతోంది. వంశధార అధికారులు పలు సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. ఈ ఏడాది కూడా కొత్తగా షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి తలెత్తింది. శిథిలావస్థలో ఉన్న షట్టర్లతోనే ఈ ఏడాది నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది.

వేధిస్తున్న లష్కర్ల కొరత

సాగునీటి రంగంలో క్షేత్ర స్థాయిలో కీలకమైన లష్కర్ల కొరత వేధించడం మరో సమస్యగా ఉంది. 1978-80 మధ్య కాలంలో లష్కర్లు, మ్యాన్‌మజ్దూర్ నియమకాలు చేపట్టారు తప్ప ఆ తర్వాత భర్తీ చేయలేదని అధికారులు చెప్తున్నారు. ఉద్యోగ విరమణ తర్వాత చాలా పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. లష్కర్లు లేకపోవడంతో నీటిని నియంత్రించే అవకాశం లేకుండాపోయింది. లష్కర్ల నియామకంపై ఇప్పుడే ఒక నిర్ణయం తీసుకుంటే ఆ ప్రక్రియ పూర్తయ్యే సరికి ఖరీఫ్ సీజన్ నాటికి వారు అందుబాటులో ఉంటారు.

పనులకు ఇదే అనువైన సీజన్

పంట కాలువలకు మరమ్మతులు, పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు వంటి పనులను సాధారణంగా వేసవిలోనే మొదలు పెడతారు. పనులను ప్రతిపాదించడం, పరిపాలన ఆమోదం వంటి కొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో మార్చి నెల నుంచే ఆ ప్రక్రియను ప్రారంభిస్తారు. కాలువల్లో నీరు లేకపోవడంతో పనులు చేపట్టేందుకు ఇదే అనువైన సమయం. అధికారుల అప్రమత్తం చేసి సరియైన సూచనలు ఇచ్చేందుకు ఐఎబి ఒక వేదికగా ఉపయోగపడుతుందని అంతా భావిస్తున్నారు.



బీచ్ ఫెస్టివల్‌కు సిద్ధం

ప్రజాశక్తి- సోంపేట

జిల్లాలోని సోంపేటలో సుందరమైన బారువా తీరంలో ఈ నెల 19, 20న బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. శనివారం ఉదయం 5 గంటలకు ప్రారంభమయ్యే ఒలివ్ రిడ్లీ తాబేలు ఉత్సవం ప్రకృతి ప్రేమికులకు, పర్యావరణ కార్యకర్తలకు ఒక ప్రత్యేక అనుభూతిని పంచనుంది. ఈ ఉత్సవ కార్యక్రమాలు ఉదయం నుంచే సందడిగా మొదలు కానున్నాయి. ఉత్సవంలో భాగంగా కొన్ని వినోదభరితమైన కార్యక్రమాలూ ఏర్పాటు చేశారు. బీచ్ వాలీబాల్ పోటీలు ఉత్సాహాన్ని నింపుతాయి. తీర ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమం కూడా నిర్వహించనున్నారు, ఇందులో అందరూ స్వచ్ఛందంగా పాల్గొనవచ్చు.

కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. కలెక్టర్ ముందుచూపుతో ప్రారంభమైన ఈ ఒలివ్ రిడ్లీ తాబేలు ఉత్సవం, ప్రకృతిని ప్రేమించే ప్రతి ఒక్కరినీ కదిలిస్తుంది. ఆయన పర్యావరణ పరిరక్షణకు ఇస్తున్న ప్రాధాన్యత ఈ కార్యక్రమం ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. వారి కృషి ఫలితంగా బారువా తీరం ఒక పర్యావరణ పరిరక్షణా కేంద్రంగా గుర్తింపు పొందుతోంది. మొత్తానికి, బారువా బీచ్‌లో నిర్వహించనున్న ఈ ఒలివ్ రిడ్లీ తాబేలు ఉత్సవం కేవలం ఒక వినోద కార్యక్రమం మాత్రమే కాదు, ఇది ప్రకృతిపై మన బాధ్యతను గుర్తుచేసే ఒక ముఖ్యమైన సందేశం. ఈ ఉత్సవంలో పాల్గొనడం ద్వారా మనం కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావచ్చు. ప్రకృతిని కాపాడుకోవడం మనందరి కర్తవ్యం. కార్యక్రమంలో విహంగ్ అడ్వెంచర్స్ వారి పారా మోటార్ ఫ్లయింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఏర్పాట్లపై విప్ సమీక్ష

బారువ తీరంలో శనివారం నుంచి రెండు రోజులపాటు నిర్వహించబోయే బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లపై ప్రభుత్వ విప్ అశోక్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులు అడిగి తెలుసుకున్నారు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ వెంకటేష్, సిఐ మంగరాజు, మెరైన్ సిఐ రమేష్‌కుమార్, తహశీల్దార్ అప్పలస్వామి, ఎస్ఐ హరిబాబు నాయుడు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

బారువా బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుంన్కర్, జెసి అహ్మద్ ఫర్మాన్ ఖాన్ శుక్రవారం పరిశీలించారు. ఈయన వెంట పలాస, టెక్కలి ఆర్‌డిఒలు వెంకటేష్, ఎం.కృష్ణమూర్తి ఉన్నారు.

మస్కట్ బాధితులకు కేంద్రమంత్రి భరోసా



బాధితులతో వీడియో కాల్‌తో మాట్లాడుతున్న కేంద్రమంత్రి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా నుంచి ఉపాధి కోసం మస్కట్ వెళ్లిన కార్మికుల సమస్యపై కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తక్షణమే స్పందించారు. మస్కట్‌లో ఉన్న నసీం ఆల్‌సలీం కంపెనీ యాజమాన్యం బారిన పడి పనిలేకుండా, జీతభత్యాలు లేకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్న 9 మంది కార్మికులతో శ్రీకాకుళం నుంచి శుక్రవారం వీడియో కాల్ ద్వారా మాట్లాడారు. అక్కడి పరిస్థితుల గురించి వారిని అడిగి తెలుసుకున్న ఆయన వారికి ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్మికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రమంత్రికి వివరించారు. విదేశాంగశాఖ అధికారులతో మాట్లాడి త్వరితగతిన స్వదేశానికి సురక్షితంగా తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడుతామని హామీనిచ్చారు. కార్మికుల కుటుంబాలు అధైర్య పడొద్దని, ప్రభుత్వం తరుపున అన్నివిధాలుగా సహకారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు.

శ్యాంపిస్టన్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

శ్యాంపిస్టన్స్ పరిశ్రమలో మార్చి నెల వేతనాలు వెంటనే చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలో వరిశాం వద్ద గల శ్యాంపిస్టన్స్ ప్లాంట్-2 పరిశ్రమ కార్మికులకు మార్చి నెల వేతనం వెంటనే చెల్లించాలని, బలవంతపు రిటైర్మెంట్ ఆపాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్ బోనస్ చెల్లించాలని కోరుతూ పరిశ్రమ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ యాజమాన్యం మార్చి నెల వేతనాలు ఏడో తేదిలోగా కార్మికులకు చెల్లించాల్సి ఉందని, కానీ, ఇప్పటి వరకు వేతనాలు చెల్లించలేదని అన్నారు. ప్రతినెలా వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో కార్మికులు బ్యాంకులో తీసుకున్న రుణాలకు 10లోపల చెల్లించాల్సిన రుణ వాయిదాలు చెల్లించలేకపోవడంతో ఒక్కో కార్మికుడికి రూ.1475 నుంచి రూ.1700 వరకు పెనాల్టీలు కట్టాల్సి వస్తోందని అన్నారు. వేతనాలు చెల్లింపు చట్టాన్ని సైతం అమలు చేయకుండా యాజమాన్యం చట్ట విరుద్ధ చర్యలకు పాల్పడుతుందన్నారు. వేతనాలు సకాలంలో చెల్లించకుండా కార్మికులను ఇబ్బంది పెట్టి రెచ్చగొట్టి సమస్యను సృష్టించడం కోసం యాజమాన్యం చూస్తుందని, కంపెనీలో ఏదైనా సమస్య సృష్టించి యూనియన్‌పై నెట్టాలని అనేక ప్రయత్నాలు చేస్తుందని విమర్శించారు. వేతన ఒప్పందం ప్రకారం ఐదేళ్లుగా బోనస్ చెల్లించడం లేదన్నారు.

గతేడాది అక్టోబరులో చెల్లించాల్సిన బోనస్ నేటికీ చెల్లించలేదని తెలిపారు. యాజమాన్యం వారు 30 సంవత్సరాలు సర్వీసు పూర్తయిందన్నారు. ఇప్పటి వరకు అక్రమంగా 110 మంది కార్మికులను బలవంతపు రిటైర్మెంట్ చేశారని పేర్కొన్నారు. దీంతో ఇదే జీవనాధారంగా ఉన్న కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బలవంతపు రిటైర్మెంట్ నిలుపుదల చేసి అక్రమంగా నిలుపుదల చేసిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకునేలా తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు ఇస్తామన్న హెల్త్ కార్డులు ఇవ్వలేదని అన్నారు. ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను వెంటనే పరిష్కరించి వేతన ఒప్పందం చేయాలన్నారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్యామ్ క్రగ్ పిస్టన్స్ (రింగ్స్) వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.అప్పలనర్సయ్య, గొర్లె కిరణ్, నాయకులు ఆర్.ఎస్.నాయుడు, కె.భోగేష్, ఎన్.నాగేశ్వరరావు, గురు ఈశ్వరరావు, ఎం.కూర్మారావు, రామారావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు



మాట్లాడుతున్న సింహాచలం

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి

వ్య.కా.స జిల్లా ప్రధాన కార్యదర్శి సింహాచలం

ప్రజాశక్తి- ఎన్ఎన్‌పేట

ఉపాధి హామీ కూలీలకు నెలల తరబడి కూలి చెల్లించకపోతే వారి జీవనం ఎలాసాగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎల్ఎన్‌పేటలో సాగునీటి చెరువు వద్ద చేపడుతున్న ఉపాధి పనిప్రదేశంలో శుక్రవారం కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 12 వారాలుగా కూలి చెల్లించకుండా పనులు చేయిస్తున్నారని అన్నారు. నిత్యావసర సరకులు కొనుక్కోలేని స్థితి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలు అప్పులు చేసుకుని జీవనం సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు వేసవి తీవ్రత ఉన్నా పనిప్రదేశాల్లో మౌలిక వసతులు, నీడనిచ్చే టెంటు, తాగునీరు, మెడికల్ కిట్లు ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం అన్యాయమన్నారు. కూలీలకు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రభుత్వాలపై వత్తిడి తీసుకురావాలన్నారు. కూలీలకు 200 రోజులు పని కల్పించడంతో రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతి, చంటి, భారతి, గొలివి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఎపిజిఎల్ఐ ఫైళ్లను పంపాలి

ఎపిజిఎల్ఐ ఎడి సతీష్‌కుమార్



సతీష్‌కుమార్, ఎపిజిఎల్ఐ ఎడి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రభుత్వ ఉద్యోగుల ఆంధ్రప్రదేశ్ జీవిత బీమా (ఎపిజిఎల్ఐ)కి సంబంధించి ఫైళ్లను ఇకపై తప్పక ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పంపాలని సంస్థ ఎడి ఎస్.సతీష్ కుమార్ ఒక ప్రకటనలో సూచించారు. ఈ ఏడాది మే నుంచి https://nidhi.apcfss.in అనే వెబ్‌సైట్‌లోని నిధి పోర్టల్ ద్వారా మాత్రమే ఫైళ్లను అప్‌లోడ్ చేయాలని సూచించారు. జీవిత బీమా ఫైళ్ల వివరాలు, నిర్బంధ బీమా ప్రీమియం, వాలంటరీ ప్రీమియం పెంపు, రుణాలు, క్లైంలు, నామినేషన్ సవరణలు వంటి డేటాను ఉద్యోగులు తమ యూజర్ లాగిన్ ద్వారా నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి సంబంధిత డిడిఒకు పంపించాలని తెలిపారు. 2025 ఫిబ్రవరి 16న ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబరు 19 ప్రకారం ఈ మార్గదర్శకాలు అమల్లోకి వచ్చాయన్నారు. డిడిఒలు తమ యూజర్ ఐడి ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేసి, ప్రాసెస్ చేసి, ఎన్‌రోల్‌మెంట్ టైటిల్‌ను జెనరేట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పాత విధానంలో ఆఫ్‌లైన్ ద్వారా ఫైళ్లను పంపే విధానాన్ని అమలు సాధ్యం కాదన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గౌతు శిరీష



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

అభివృద్ధిలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీని జిల్లాలో ప్రథమ స్థానంలో నిలుపుతామని ఎమ్మెల్యే ఎగౌతు శిరీష అన్నారు. స్థానిక 27వ వార్డు భద్రమ్మ కోనేరు వద్ద రూ.27 లక్షలతో నిర్మించనున్న ప్రహరీకి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే తాగునీటికి రూ.63 లక్షలు కేటాయించగా, పనులు చురుకుగా సాగుతున్నాయని తెలిపారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.48 కోట్లు కేటాయించాయని, దీనికి చెందిన పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. పార్టీలకతీతంగా అన్నీ వార్డుల్లో రోడ్లు, కాలువలు నిర్మించేందుకు చర్యలు తీసకుంటున్నామని తెలిపారు. వేసవి నీటి ఎద్దడి నివారణకు అదనంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించామన్నారు. అభివృద్ధికి టిడిపి ఎప్పుడూ ముందు ఉంటుందని చెప్పడానికి మున్సిపాలిటీలో చేపడుతున్న కార్యక్రమాలే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, బిసిసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్ గుప్త, సప్ప నవీన్, దడియాల నర్సింహులు, ఎం.నరేంద్ర(చిన్ని), ఎ.రామకృష్ణ, కొత్త సత్యం, కమిషనర్ ఎన్.రామారావు పాల్గొన్నారు.

అధికారం ఉన్నా పనిచేసుకోలేకపోతున్నా...

లండారిపుట్టుగ సర్పంచ్ ఆవేదన



మాట్లాడుతున్న సర్పంచ్ కుమారి

ప్రజాశక్తి- కవిటి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తాను స్వేచ్ఛగా పనిచేసుకోలేకపోతున్నానని, పంచాయతీ అభివృద్ధికి వేసే ప్రతి ప్రణాళికకూ ఎమ్మెల్సీ రామారావు ప్రోద్బలంతో అధికారులు కొర్రీలు వేస్తున్నారని లండారిపుట్టుగ సర్పంచ్ మురపాల కుమారి ఆరోపించారు. తన భర్త కాళీ ప్రసాద్‌తో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్సీ పంచాయతీలో అభివృద్ధి అడ్డుకుంటున్నట్టు ఆరోపించారు. ముఖ్యంగా ఉపాధి హామీ నిర్వీర్యం చేస్తూ పేదల పొట్ట కొడుతున్నారని మండిపడ్డారు. తమ రెవెన్యూ పరిధిలో 14 చెరువులు ఉన్నాయని, అవీ తమ పంచాయతీకి 2,3 కిలో మీటర్ల పరిధిలోనే ఉన్నా తమకు పని కల్పించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డ్వామా పీడీకి పిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని నిస్సహాయత వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ అల్లుడు అనధికార ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ వ్యవస్థ పాడుచేస్తున్నట్టు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత లేని వ్యక్తికి అధికారం ఎలా ఇచ్చారని సర్పంచ్ మండిపడ్డారు. చివరికి స్థానిక ఎమ్మెల్యే చెప్పినా తమ పంచాయతీలో పనులు జరగడం లేదని వారు వాపోయారు. తమకంటే చిన్న పంచాయతీ శిలగాంకు రూ.23 లక్షలు, బెలగాంకు రూ.30 లక్షలు కేటాయించి తమకు మాత్రం కేవలం రూ.16 లక్షలకే పరిమితం చేసినట్టు తెలిపారు. చేసిన పనులకూ బిల్లులు చెల్లించకుండా తిప్పిస్తున్నట్టు వాపోయారు. చివరికి తన సొంత డబ్బులతో పంచాయతీ అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. నాయకుడు ప్రజా సంక్షేమానికి పాటుపడాలి కానీ, ఇలా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పాకులాడకూడదని హితవు పలికారు. అధికారులు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో టిడిపి నాయకులు లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


మాట్లాడుతున్న విప్ అశోక్

22ఎ సమస్యపై సమీక్ష

సోంపేట : పట్టణంలోని శ్రీ కళ్యాణ మండపంలో శుక్రవారం 22ఎ సమస్యపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ అశోక్‌తో పాటు మాజీ మంత్రి శివాజీ, ఆర్‌డిఒ వెంకటేష్, తహశీల్దార్ అప్పలస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టులోని నాలుగు వీధుల్లోని ప్రయివేటు వ్యక్తుల భూములు 22ఎ జాబితాలో నమోదు కావడంతో వారు పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. క్రయవిక్రయాలు జరగక అత్యవసర పరిస్థితుల్లో తమ ఎదుర్కొంటున్న సమస్యలను బాధితులు ఎమ్మెల్యే వివరించారు. త్వరలోనే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రమోహన్, శ్రీను పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి- కవిటి

సచివాలయ వ్యవస్థలో కీలకమైన విద్య, సంక్షేమ సహాయకులకు (వెల్ఫేర్ అసిస్టెంట్లు) ఉద్యోగోతులు కల్పించాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసిన వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్య, సంక్షేమ సహాయకుల అనుభవ జాబితా ప్రకటించి పే స్కేల్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పథకాల అమలు చేస్తూ, ప్రజలు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు తక్షణమే ఉద్యోగోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, రంగారావు, వాసు, వెంకటరావు, యాదవరావు, పందిరి రమేష్, కర్ణారావు, నూకరాజు, రవి, ప్రకాష్ పాల్గొన్నారు.


బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

బోరుకు మరమ్మతులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

బూర్జ: మండలంలో మామిడివలస గ్రామంలో గత ఐదురోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా శుక్రవారం ప్రజాశక్తి పత్రికలో గొంతెండుతోంది పట్టించుకోరూ అనే వార్త ప్రచురితం కావడంతో స్పందించిన కార్యదర్శి అరుణకుమారి, సర్పంచ్ ప్రతినిధి రామకృష్ణ వెంటనే మరమ్మతులకు గురైన మోటర్‌ను తొలగించి కొత్త మోటర్ అమర్చి పైపులైన్ ద్వారా తాగునీరు అందించారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.


బహుమతులను అందజేస్తున్న మోహన్

'జ్ఞాన జ్యోతి'లో ఐఐటిపై అవగాహన

నరసన్నపేట : స్థానిక జ్ఞాన జ్యోతి స్కూల్‌లో శుక్రవారం ఐఐటి అవగాహన కల్పించారు. ఐఐటి చదివిన విద్యార్థులకు ఉపయోగాలు, ఉద్యోగ అవకాశాలను మెంటార్స్ అకాడమీ ఐఐటి ఫౌండర్ మోహన్ వివరించారు. విశిష్ట అతిథిగా బోరుభద్ర హైస్కూల్ ప్రధానోపాధ్యాయులైన పాగోటి రామకృష్ణ విద్యార్థులు రానున్న కాలంలో ఐఐటి ఆవశ్యకతను వివరించి వారి భవిష్యత్‌కు పునాదులు వేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జ్ఞాన జ్యోతి స్కూల్ మేనేజ్‌మెంట్ వెలమల భాస్కరరావు, బోర రామారావు, తర్ర సత్యనారాయణ, పోగోటి లక్ష్మి పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా మత్స్యకార భరోసా


పాపారావు

వజ్రపుకొత్తూరు: రాజకీయాలకు అతీతంగా మత్స్యకార భరోసా అందజేస్తామని బిసి సెల్ ప్రధాన కార్యదర్శి గోవింద పాపారావు అన్నారు. ఈ మేరకు కొత్తపేటలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం మత్స్యకారులకు రూ.20 వేలు ఈ నెల 26న సిఎం నారా చంద్రబాబు విడుదల చేస్తారని అన్నారు. మత్స్యకార గ్రామాల్లో అధికారులతో ముమ్మరంగా తెప్పలు, బోట్లు రిజిస్ట్రేషన్ చేపడుతున్నారని అన్నారు.

జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలో నవ్య ప్రతిభ


నవ్య

కోటబొమ్మాళి : ఆలివ్ రిడ్లి తాబేళ్ళ సంరక్షణపై అవగాహనకు జిల్లాస్థాయిలో విద్యాశాఖ శుక్రవారం నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని నందిగాం నవ్య ద్వితీయ బహుమతి పొందింది. సోంపేట మండలం బారువ బీచ్‌లో శనివారం నిర్వహించనున్న ఆలివ్ రిడ్లి తాబేళ్ల పండగ కార్యక్రమంలో భాగంగా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్, డిఇఒ చేతుల మీదుగా నవ్య బహుమతి అందుకోనుంది. ఈ సందర్భంగా విద్యార్థిని నవ్యకు, ఆమెకు తర్ఫీదు ఇచ్చిన చిత్రలేఖనం ఉపాధ్యాయుడు జి.పాపారావుకు ఎంఇఒలు ఎల్.వి.ప్రతాప్, సిహెచ్.గోవిందరావు, ప్రధానోపాధ్యాయులు డి.గోవిందరావు అభినందించారు.

అధ్వానంగా బెల్లుకోట రోడ్డు


అధ్వానంగా ఉన్న రోడ్డు

నందిగాం: మండలంలోని పోతు లూరి పంచాయతీ కర్లపూడి నుంచి రతజన బొడ్డపాడు పంచాయతీ బెల్లుకోల వరకు గల రోడ్డు అధ్వానంగా తయారైంది. 2016లో రూ.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన రోడ్డు తొమ్మిదేళ్లలోనే పూర్తిగా అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై వాహన చోదకులు, బాటసారులు వెళ్లాలంటే పొలంగట్లే నయమన్న స్థితిలో దర్శనమిస్తోంది. దీంతో ప్రయాణికులు భయంతో వాహనాలు నడుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరచూపి ఈ రోడ్డును పునర్నిర్మించాలని ఎంపిటిసి మాజీ సభ్యులు రామ్మూర్తి కోరుతున్నారు. ఈ రోడ్డుపై బైరిపాటపాడు, బెల్లుకో, సవరనీలాపురం ఒంటి గిరిజన గ్రామాలకు ఇది మండల కేంద్రానికి అనుసంధానం.

తరలిపోతున్న మట్టి

- రెచ్చిపోతున్న మాఫియా
- చోద్యం చూస్తున్న అధికారులు

ఇసుక, నీరు, మట్టి అక్రమంగా తరలించేందుకు కాదేది అనర్హం అన్న చందంగా తయారైంది. బూర్జ మండలంలో మట్టి మాఫియా చెల రేగిపోతున్నారు. మట్టిని తరలించుకుపోతున్నా పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారు.


మట్టికోసం తవ్వేసిన కాలువ గట్టు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతున్నారు. మట్టిని కొల్లగొట్టేందుకు చెరువులు, కాలువలు, చివరకు పొలాల్లో కూడా ఉన్న మట్టిని దోచేస్తున్నారు. ఏది దోచుకున్నా మాకు అడ్డే లేదు. మాకు అడిగేవారే లేరు అన్న ధీమాతో మట్టి మాఫియా చెల రేగిపోతున్నారు. మండలంలోని అల్లెన, కిలంతరి, ఏటొడ్డపర్త, పెద్దపేట, అన్నంపేటతో పాటు మరికొన్ని గ్రామాల్లో మట్టిని అక్రమంగా తరలించుకు పోతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామాల్లో అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా పొలాల్లోనూ, కాలువల్లోనూ మట్టిని తవ్వేస్తూ తరలించుకుపోతున్నారు. ముఖ్యంగా నాగావళి నదీ తీర ప్రాంతాల్లో ఆనుకుని ఉన్న డేళాయ్ ఛానల్‌లోని మట్టిని కొల్లగొట్టారు. కాలువల్లో మట్టి తవ్వకాల కోసం కల్వర్టుల పైన ఉన్న చెట్లను, కాలువలను ఇష్టారాజ్యంగా ప్రొక్లెయిన్లు, ఉపయోగించి తవ్వకాలను సాగిస్తున్నారు. మండలంలోని గ్రామాల నుంచి తరలిస్తున్న ఈ మట్టిని సరుబుజ్జిలి, విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలంలోని కుమ్మరి అగ్రహారం దగ్గర గ్రామాలకు తరలించుకుపోతున్నారు. ముఖ్యంగా అనధికారికంగా వివిధ మండలాల్లో వెలుస్తున్న రియల్ ఎస్టేట్లకు ఈ మట్టిని తరలిస్తున్నారు. మట్టి తరలించుకుపోతున్న సమయంలో కాలువ గట్లపై ఉన్న భారీ వృక్షాలు సైతం నేల కొరుగుతున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులకు అక్రమ మట్టి తరలింపును చూస్తున్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.


మట్టిని లారీకి లోడ్ చేస్తున్న ప్రొక్లెయినర్

చోద్యం చూస్తున్న అధికారులు...

మట్టిని తవ్వి తరలింపు కోసం అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరి అయినప్పటికీ ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని ట్రాక్టర్లు, లారీలతో తరలిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తరలించేందుకు మీకు అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నిస్తే తమకు రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు ఉన్నాయని చెబుతున్నారు. బహిరంగంగా మట్టిని తరలిస్తున్నప్పటికీ తహశీల్దార్‌తో పాటు ఇతర రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంలో ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అలాగే మైనింగ్ శాఖ అధికారులు కూడా జాడ కనిపించడం లేదని, ముఖ్యంగా అధికారులు, సిబ్బంది మామూళ్ల మత్తులో జోగుతున్నారని మండల ప్రజలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఇలాగే కొనసాగితే ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి తరలింపును అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువతకు నైపుణ్య శిక్షణ

ఆమదాలవలస: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దీన దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 18 నుంచి 35 ఏళ్లుకలిగిన గ్రామీణ యువతీ యువకులు నైపుణ్య శిక్షణ, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం, యూనిఫాం, కోర్సు మెటీరియల్ అందించ బడునని తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరినట్లు ఆ ప్రకటనలో తెలియజేశారు. కోర్సు, శిక్షణా కేంద్రాల వివరాల కొరకు లింక్ ఏర్పాటు చేయడం జరిగిందని అర్జీదారులు ఎవరైనా ఉంటే పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అలాగే నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలోని ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పొందాల్సిన అభ్యర్థులు నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు కిట్లు పంపిణీ

ఆమదాలవలస: 2024 జూలైలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు చేపట్టారు. అయితే శనివారం జనసేన కిట్లను వాలంటీర్లకు పంపిణీ చేయనున్నట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. క్రియాశీలక సభ్యుల సభ్యత్వ కార్డులను నమోదు చేయించిన వాలంటీర్లకు జనసేన కేంద్ర కార్యాలయ సిబ్బంది ద్వారా పట్టణంలోని నియోజకవర్గ కార్యాలయంలో అందజేయడం జరుగు తుందని తెలిపారు. సభ్యత్వ నమోదు చేయించిన క్రియాశీలక వాలంటీర్లు అందరూ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయానికి హాజరు కావాలని కోరారు.

సోంపేటలో చిరుజల్లులు

సోంపేట : వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం సోంపేట పట్నంలో కురిసిన చిరుజల్లులు ఉపసమాన్ని కలిగించాయి. సాయంత్రం ఈదురు గాలులతో కూడిన చినుకులు పడడంతో వాతావరణం ఒక్కసారి చల్లదనంగా మారింది.

అంగరంగ వైభవంగా జలయాత్ర

ఇచ్ఛాపురం: పట్టణంలోని బెల్లుపడలో శనివారం నుంచి ఈ నె 23 వరకు ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా శ్రీరామతారక మహామంత్ర సహిత పంచకుండాత్మక యాగ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశారు. యాగ నిర్వహణలో భాగంగా శుక్రవారం మధ్నాహ్నం వందల మంది మహిళలు బాహుదా నది నుంచి జలాలు తీసుకొచ్చేందుకు జలయాత్ర నిర్వహించారు. బెల్లుపడ నుంచి కార్జీ వీధి, ఆస్పత్రి రోడ్డు, మెయిన్ రోడ్డు మీదుగా వందలాది మంది మహిళలు బాహుదా నదికి వెళ్లి కలశాలతో జలాలను తీసుకొచ్చారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు, పురప్రముఖులు, బెల్లుపడా వాసులు పాల్గొన్నారు. శోభ యాత్రా సందర్భంగా నిర్వహించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది.


ఆకట్టుకున్న కోలాటం

తలనొప్పిగా మారిన స్పెషల్ డ్రైవ్


ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులకు తలనొప్పి వ్యవహారంగా మారుతుంది. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది విద్యా సంవత్సరం ముగింపులోనే రానున్న విద్యా సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని నూతన ప్రవేశాలు చేపట్టాలని ఉన్నతస్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల్లో భాగంగా స్పెషల్ డ్రైవ్ కూడా నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల్లో ఐదో తరగతి పూర్తి చేసిన వారిని పరిసరాల్లోని ఉన్నత పాఠశాలల్లో చేర్పించాలని, అంగన్వాడీల్లో ఐదేళ్లు పూర్తి చేసిన వారిని ప్రాథమిక పాఠశాల్లో చేర్పించాలని ఆదేశించారు. కానీ, అమలులోకి వచ్చేసరికి వాస్తవరూపం దాల్చడం లేదు. దీంతో స్పెషల్ డ్రైవ్ పేరుతో విద్యార్థులను చేర్పించుకోవడానికి ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్తున్నారు. ఈ సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్న మాటలు చేదు అనుభవాన్ని మిగుల్చుతుండడంతో లక్ష్యం చేరుకోవడానికి ఉపాధ్యాయులకు తలనొప్పి వ్యవహారంగా మారుతుంది. చాలావరకు గ్రామీణ ప్రాంతాల్లోని పలువురు విద్యార్థులు ఆయా పరిధిలో ఉన్న ప్రయివేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు చాలా వరకు ప్రభుత్వం కెజిబివి, గురుకుల పాఠశాలలు వంటివి ఏర్పాటు చేయడంతో ఆయా పాఠశాలల్లో చదివేందుకు ఎక్కువ శాతం మంది ఆసక్తి చూపడం గమనార్హం. ఇదిలా ఉండగా ప్రయివేట్ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు రాయితీపై ప్రవేశాలు కల్పనకు ప్రభుత్వం ఆసక్తి చూపడం దీనికి సంబంధించి నోటిపికేషన్ జారీ చేయడంతో చాలామంది వాటిపైనా దృష్టిసారిస్తున్నారు. యుటిఎఫ్‌శాఖ సామాజిక స్పృహతో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం నినాదంతో ముందుకు వెళ్లినా వారికీ చేదు అనుభవమే మిగులుతుండడం విశేషం. కాగా, గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల సమఖ్యను భట్టే వాటిస్థాయిని పెంచుతామని ఒకపక్క ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా గ్రామాల్లోని పాఠశాలల్లో అసలు విద్యార్థులే చేరకపోవడంతో ఆయా పరిధిలోని ఉపాధ్యాయులకు వ్యవహారం తలనొప్పిగా మారుతుంది. దీనిపై ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

సిపిఎం నాయకుల పరామర్శ


పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అనారోగ్యంతో బాధపడుతున్న రైతు సంఘం, సిపిఎం సీనియర్ సభ్యులు కవిటి బాలరాజును సిపిఎం నాయకులు పరామర్శించారు. శుక్రవారం ప్రతాపవిశ్వనాథపురంలోని బాలరాజు స్వగృహానికి సిపిఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు, సిఐటియు పూర్వ జిల్లా అధ్యక్షులు ఆర్. సురేష్‌బాబు, మహిళా సంఘం నాయకురాలు బమ్మిడి సుగుణవతి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసు కున్నారు. నరాల సంబంధిత అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యమ జ్ఞాపకాలు పంచుకున్నారు. 1962,63లో పైల వాసు దేవరావు, బమ్మిడి శ్రీరాములు ప్రభావంతో స్కూల్ విద్యార్థి దశలోనే వామపక్ష రాజకీయాల వైపు ఆకర్షించ బడినట్లు తెలిపారు. యువజన సంఘంలో పనిచేస్తూ 1983లో సిపిఎం సభ్యత్వం తీసుకుని తర్వాత కాలమంతా రైతు సంఘంలో పనిచేసినట్లు చెప్పారు. నందిగాం, వజ్రపుకొత్తూరు మండలాల్లో ప్రజా సంఘాలు, పార్టీ నిర్మాణా నికి పనిచేస్తున్న కార్యకర్తలందరికీ సహకరించిన విషయాలు గుర్తు చేసుకున్నారు. ఉద్యమ సహచరులతో ఇంకా అనేక సంఘటనలు చెప్పాలనే తపన ఆయనకు ఉన్నా నోటి నరాలు సహకరించకపోవటంతో బాధపడ్డారు. భార్య శకుంతల, పెద్దకుమారుడు శంకర్ ఆయనకు సేవలంది స్తున్నారు. మరో ఇద్దరు కుమారులు ఉద్యోగాలు చేసుకుంటూ ఉన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం




పోస్టర్‌ను విడుదల చేస్తున్న డిఎస్‌పి వివేకానంద

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వ్యాయామం వల్లే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, శారీరక ధృడత్వం పెరుగుతుందని శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్ వివేకానంద అన్నారు. నగరంలోని మండలవీధి జంక్షన్‌లోని ఫ్లెక్స్ జిమ్‌లో శ్రీకాకుళం బాడీబిల్డర్స్ అసోసియేషన్ లోగోను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈఏడాది జూన్ 15న నిర్వహించనున్న జిల్లాస్థాయి బాడీబిల్డింగ్ పోటీల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉబకాయం, మానసిక స్థితి, శారీరక ఒత్తిడిని జయించడానికి యువత వ్యాయామంపై శ్రద్ధ వహించాలన్నారు. అప్పుడే సంపూర్ణ ఆరోగ్యం సాధించుకోగలరన్నారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం జిమ్‌ను ఏర్పాటు చేసి వందలాది మందికి తర్ఫీదు ఇస్తున్న కె.గౌరీశంకర్‌ను ఆయన అభినందించారు. నెలలో ఏదో ఒక రోజు ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కలిగేలా ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం యువత చెడు వ్యసనాలకు లోనై ఆరోగ్యంపై అశ్రద్ధ చేస్తున్నారని, మత్తును వీడి ప్రతిరోజూ వ్యాయామం చేసి ఆరోగ్యాన్ని కాపాడు కోవాలన్నారు. అనంతరం డిఎస్‌పిని కోచ్ గౌరీశంకర్ శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వడ్డి కాంతారావు, రాయితీ చంద్రశేఖర్, పైల చంద్రశేఖర్, బూర్లె అప్పారావు, చంటి, పాత్రో, సతీష్, రామయ్య, పి.రాజు, ధనాల చిట్టిబాబు పాల్గొన్నారు. అనంతరం శ్రీకాకుళం బాడీబిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కొమ్మాన గౌరీశంకర్, ఉపాధ్యక్షునిగా ఆర్.ఢిల్లీశ్వరరావు, సెక్రటరీగా బలగ ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా పైడి రాజు, ట్రెజరర్‌గా సాయికిరణ్, జాయింట్ సెక్రటరీగా దేవీప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మణికుమార్ తదితరులు ఎన్నికయ్యారు.

అనుమానాస్పద స్థితిలో ఉద్యోగి మృతి


వెంకటరమణ (ఫైల్)

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట మారుతి నగర్ ఒకటో వీధికి చెందిన కొర్లాయి వెంకట రమణ (57) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు ఆమదాలవలస మండలం మెట్టక్కివలసకు చెందిన వెంకట రమణ నరసన్నపేట వంశధార శాఖలో ఎటెండర్‌గా విధులు నిర్వహిస్తూ... మారుతీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. అయితే అతని భార్య కొద్దిరోజుల క్రితం మృతి చెందింది. కుమారుడు ఉద్యోగ నిమిత్తం విశాఖలో ఉంటున్నారు. అయితే గత మూడు రోజులుగా ఇంట్లో నుంచి బయటకు రాలేదు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి


మృతి చెందిన ఆవు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పిడుగు పడిన ప్రమాదంలో ఆవు మృతి చెందింది. గరుడభద్ర పంచాయతీ మర్రిపాడుకు చెందిన మహిళ రైతు బొల్ల సుజాత ఆవు మృతి చెందింది. గ్రామానికి సమీపంలోని పొలాల్లో శుక్రవారం సాయంత్రం మేత చేస్తుండగా, ఒక్కసారిగా ఈదురు గాలులు, మెరుపులతో పిడుగు పడడంతో ఆవు ప్రమాద స్థలంలోనే మృతి చెందింది. పాడి ఆవు విలువ సుమారు రూ.30 వేలు ఉంటుంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని పశు విద్యాధికారి డాక్టర్ మెట్ట పాపారావు తెలిపారు.


సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

బెల్లం ఊటలు ధ్వంసం

మెళియాపుట్టి: మండలంలోని భరణికోట పంచాయతీ మరలో టెక్కలి సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యాన సిఐ షేక్ మీరా సాహెబ్ నాటుసారా తయారీ స్థావరాలపై శుక్రవారం సంయుక్త దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1900 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకు న్నారు. అనంతరం గ్రామస్తులకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలను తెలియజేశారు. సారా తయారీ మానుకోవాలని సూచించారు. దీని తయారీ కోసం బెల్లం ఎవరి దగ్గర నుండి తెచ్చారో ఎంక్వయిరీ చేసి కేసు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.


మాజీ ఎంపీని అభినందిస్తున్న బాలకృష్ణ తదితరులు

మాజీ ఎంపీకి అభినందన

ప్రజాశక్తి- లావేరు

విజయనగరం మాజీ పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్‌కు ఇటీవల మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిఎసి కమిటీ సభ్యులుగా చంద్రశేఖర్‌ను పార్టీ నియమించడంతో లావేరు మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ ఆధ్వర్యంలో పలువురు శుక్రవారం కలిసి మాజీ ఎంపీకి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడి పని చేయాలన్నారు. మరలా ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి వస్తేనే సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతాయనే విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పోతయ్యవలస సర్పంచ్ కొంపెల్ల అప్పన్న, శ్రీనివాసరావు తదితరులున్నారు.


ఎల్లమ్మ ఆలయం

రేపు ఎల్లమ్మ జాతర

కవిటి: పచ్చని పుటియాదల పొలాల్లో కొలువైన ఎల్లమ్మ నూతన మండపం నిర్మాణంతో పాటు పలు చిత్రాలతో చూడముచ్చటగా ముస్తాబైంది. ఈ సందర్భంగా ఆదివారం మండపం ప్రతిష్టతో పాటు సుమారు 5 వేల మంది భక్తులకు అన్నదానం జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- రణస్థలం

అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి పైల అశోక్ అన్నారు. శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పైడిభీమవరం ఆరో ఎక్టివా ఫార్మా లిమిటెడ్ పరిశ్రమలో కార్మికులకు అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రమాదం జరిగే సమయంలో అప్రమత్తంగా ఉంటే నివారించుకోవచ్చన్నారు. బెంజీన్ ట్యాంక్ ఫామ్ వద్ద, ట్యాంక్ నుంచి బ్యాంజీన్ లీక్ అండ్ ఫైర్ వలన అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయి, అగ్ని ప్రమాదాలు జరిగినపుడు వాటిని ఎలా నివారించాలి, ప్రమాదం జరగకుండా తీసుకునే జాగ్రత్తలు మాక్ డ్రిల్ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, పరిశ్రమ కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు


రణస్థలం : అగ్ని ప్రమాద నివారణపై మాక్ డ్రిల్ చేస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం : అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా పట్టణంలోని వివిధ పెట్రోల్ బంకుల వద్ద అగ్నిమాపక అధికారులు ప్రమాదాలు ఎలా చోటు చేసుకుంటున్నాయి... వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారి ప్రశాంత్‌కుమార్, సూర్యారావు, కామరాజు, ఎన్.డి.ప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తూరు : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పాలకొండ రోడ్‌లో ఉన్న అదక్‌సాయి సాయి బింద్ర పెట్రోల్ బంక్, నివాగాం రోడ్డులోని ఇండియన్ గ్రామీణ మిత్ర గ్యాస్ స్టాక్ పాయింట్‌ల్లో అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారి ఎన్.బుచ్చోడు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిన్నింటి రామారావు నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే

ప్రజాశక్తి- రణస్థలం

మండల కేంద్రంలో ఉన్న చర్చిల్లో, అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న చర్చల్లో ఆయా చర్చి పాదర్‌ల ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటలకు సంబంధించి దైవ సందేశాన్ని వివరించారు. శిలువమార్గం చేస్తూ పాద యాత్రగా వెళ్లారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు శిలువ వేసే సమయంలో పడిన పాట్లును వివిధ వేషధారణలతో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. క్రైస్తవులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని పలు చర్చిల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలు క్రైస్తవ సోదరులు నిర్వహించారు. మండల కేంద్రంలోని సిఎంసి చర్చితో పాటు, రాపాక, కొంచాడ, లుట్టపేట, తండ్యాంతో పాటు పలు గ్రామాల్లో చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు సిహెచ్ జీవన్, ప్రభుదాసు, జోషఫ్ తదితరులు పాల్గొన్నారు.


పొందూరు : చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు


రణస్థలం : శిలువమార్గం చేస్తూ పాదయాత్ర చేస్తున్న క్రైస్తవులు

ఇచ్ఛాపురం : గుడ్ ఫ్రైడే సందర్భంగా స్థానిక ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో క్రిస్టియన్లు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం యేసుక్రీస్తు సిలువలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్ జాన్సన్, నిర్మలమ్మ, శివరావు, చుక్క ఢిల్లీరావు, ప్రత్తి విజయకుమార్, గువ్వాడ దిలీప్, ప్రత్తి అమిత్, చర్చి అధ్యక్షులు ప్రత్తి విజయ్ కుమార్, సెక్రటరీ తాతాజీబాబు, ట్రెజరీ వజ్రపు వెంకటేష్ పాల్గొన్నారు.

టెక్కలి : క్రైస్తవుల పవిత్ర పర్వదినమైన గుడ్ ఫ్రైడే వేడుకలను టెక్కలి పట్టణంలో పలు చర్చిల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులోభాగంగా పలువురు చర్చి ఫాస్టరులు క్రీస్తు బోధనలపై సందేశాలు చేపట్టారు. పలు చర్చిల్లో మతపరమైన కార్యక్రమాలు నిర్వహణ సందర్భంగా చేపట్టిన పలు కార్యక్రమాలు పలువురుని ఆలరించాయి.

సోంపేట : గుడ్ ఫ్రైడే పర్వదినం పురస్కరించుకుని సోంపేటలో శుక్రవారం పలు చర్చిల్లో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యాన నిర్వహించిన క్రీస్తు సిలువ విజయోత్సవ యాత్రలో డాక్టర్ అబ్రహం, డాక్టర్ వరదాన్ పాల్గొన్నారు.


విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వ పాఠశాలల్లోనే బడిఈడు పిల్లలను చేర్పించాలంటూ గూనానపేట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గురుగుబెల్లి మధుబాబు పేర్కొన్నారు. మండలంలోని గూనానపేటలో ఇంటింటా శుక్రవారం అడ్మిషన్ క్యాంపెయిన్ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ, అలాగే తల్లిదండ్రులు పనిచేసే ప్రదేశాలకు ఉపాధ్యాయులు వెళ్లి పాఠశాలలో అందిస్తున్న ప్రయోజనాలను వివరిస్తూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చుక్కలు తిరుపతిరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం


కామేశ్వరరావు (ఫైల్)

నగరంలోని బలగ సాయినగర్ కాలనీలో నివాసముంటున్న కె.కామేశ్వరరావు (92) శుక్రవారం మృతి చెందారు. తండ్రి అభ్యర్థన మేరకు ఆయన మరణానంతరం ఆయన నేత్రాలను కుమారులు సూర్యనారాయణ, నారాయణమూర్తి, సతీష్‌లు ఆయన నేత్రాలను దానం చేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావుతో మాట్లాడి మగటపల్లి కళ్యాణ్ నేత్ర సేకరణ కేంద్రానికి ఫోన్ ద్వారా సమాచారాన్ని తెలిపారు. ఐ టెక్నీషియన్ పూతి సుజాత, నంది ఉమశంకర్‌లు హాజరై కార్నియాలు సేకరించి విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గా శ్రీనివాస్‌లు అభినందించారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టే కుట్ర


శంకర్, ఎమ్మెల్యే

శ్రీకాకుళం: టిటిడిలో మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయంగా లాభపడాలన్న ఆలోచనతో కరుణాకర రెడ్డి గోశాలలో ఆవులు మృతి చెందాయని అసత్య ప్రచారానికి తెరతీశారని, గతంలో ఆలయంపై యాత్రికుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఆయన వ్యాఖ్యలు చేశారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గోశాలలో వార్ధక్యం, ప్రసూతి సమయాల్లో వ్యాధులు సంక్రమించడం వల్ల సగటున ప్రతినెలా 10 ఆవులు మృతి చెందడం జరుగుతోందన్నారు. గోశాలలో మృతి చెందిన ఆవులను అధికారిక లాంఛనాలతో ఖననం చేయడం జరుగుతుందే తప్ప పోస్టుమార్టం చేయడం సాధ్యం కాదని, ఉద్దేశ్య పూర్వకంగానే యాత్రికుల మనోభావాలను దెబ్బతీసేందుకు పోస్టుమార్టం చేయమంటున్నా రన్నారు. ఇటువంటి చౌకబారు కుట్రలను మానుకోవాలని ఆయన హితవు పలికారు.

టిడిపిలో ప్రతిఒక్కరికీ గుర్తింపు


ఎమ్మెల్యేని సత్కరిస్తున్న బెలగాం వాసులు

కవిటి: టిడిపిలో ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సూచించారు. ఎఎంసి ఛైర్మన్‌గా జాడుపూడి ఆర్ఎస్‌కు చెందిన బి.మణిచంద్ర ప్రకాష్‌ను నియమించిన సందర్భంగా బెలగాం నాయకులు, టిడిపి అభిమానులు విప్‌కు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి సత్కరించారు. బెందాళం రమేష్, ఎఎంసి ఛైర్మన్ మని చంద్రప్రకాష్, సంతోష్ పట్నాయక్, రంగా రౌలో పాల్గొన్నారు.

చినుకు పడితే అంతే...


జీడి పిక్క బొమ్మ వద్ద పేరుకు పోయిన చెత్తా చెదారం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ పట్టణంలో చిన్న చినుకు పడితే రోడ్డు అంతా మురుగు నీటితో నిండిపోతుంది. కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారం రోడ్లపై దర్శనమిస్తుంది. అధికారులు అనాలోచిత నిర్ణయాలు కాలువల నిర్మాణంలో నాణ్యత లోపంతో వర్షపు నీరు, మురుగునీరు, చెత్తా చెదారం రోడ్లపై చిరు దుకాణాల్లో వచ్చి చేరడంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో శుక్రవారం మధ్యాహ్నం చిన్నపాటి వర్షం కురిసింది. దీంతో మురుగు కాలువల నుంచి నీరు రోడ్లపై ప్రవహించింది. దీంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాస్తవానికి వర్షం కురిస్తే మురుగు నీరు, చెత్తా చెదారం రోడ్లపై ప్రవహిస్తోందని మున్సిపల్ అధికారులు నూతనంగా కాలువలు నిర్మాణం చేపట్టారు. అధికారుల అనాలోచిత నిర్ణయాలు, నిర్మాణంలో నాణ్యత లోపంతో పాత విధానం లాగానే తయారైంది. పలాస జీడి పిక్క బొమ్మ, ఆంజనేయస్వామి ఆలయం వద్ద మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది.


ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రవహిస్తున్న మురుగు నీరు

24 నుంచి 'ఎమ్మెల్యే కప్' క్రికెట్ పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈనెల 24 నుంచి జిల్లాస్థాయి ఎమ్మెల్యే కప్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించబడునని సిఎం సిసి క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, రాష్ట్ర టిడిపి లీగల్‌సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో విలేకరులతో మాట్లాడుతూ చిరంజీవి మెమోరియల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 24న ఎమ్మెల్యే కప్ క్రికెట్ టోర్నమెంట్ 2025 పోటీల ప్రారంభోత్సవం జరుగునని తెలిపారు. టి 20 ఓవర్ల మ్యాచ్ నాకౌట్ పద్ధతిలో జరుగుతాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుందని, మే 25న ఫైనల్ మ్యాచ్ ఉంటుందన్నారు. ఆంధ్ర క్రికెట్ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిష్ణాతులైన అంపైర్ల సమక్షంలో మ్యాచ్‌లు నిర్వహించబడునని, ఈనెల 22న డ్రా తీయబడునని తెలిపారు. ఎవరైనా ఆసక్తిగల టీంలు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.5 వేలు చెల్లించాలని, విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, వ్యక్తిగత బహుమతులు కూడా ఇవ్వబడునని తెలిపారు. పేర్లు నమోదుకు 9848033159ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో క్రికెట్ టోర్నమెంట్ అసోసియేషన్ సభ్యులు నారా ఈశ్వరరావు, మెట్ట నాగు, బొడ్డేపల్లి రమేష్, గంధం వేణుగోపాలరావు, కె.సుధాకరరావు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణతో ప్రయోజనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సుదీర్ఘ కాలం పాటు ఎస్‌సి వర్గీకరణ కోసం ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యాన వివిధ రూపాల్లో ఉద్యమించడం వల్ల ఎట్టకేలకు విభజన సాధ్యమైందని, దీనివల్ల ఎస్‌సిల్లో అట్టడుగున ఉండి రిజర్వేషన్ ఫలాలను పొందలేని వారికి ప్రయోజనం చేకూరుతుందని టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోర సురేష్ అన్నారు. శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. అనేక మార్లు వ్యయప్రయాసల కోర్చి న్యాయపోరాటం చేసినప్పటికీ విభజన జరగక ఆ వర్గాల ప్రజలు విద్య, ఉద్యోగాలకు దూరమయ్యారన్నారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సుప్రీం కోర్టు సూచనలను అనుసరించి విభజన చేపట్టడంతో ఎస్‌సి వర్గాలకు మేలు చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు కవ్వాడి సుశీల, కాగాన లక్ష్మణరావు, అప్పారావు, రాగోలు అసిరమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్

పోరాట ఫలితమే...

అరసవల్లి: పాత శ్రీకాకుళం దళితవీధి కమిటీ హాల్లో అభినందన సభ నిర్వహించారు. ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఇఎఫ్, ఎంఎంఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మాదిగ, ఉపకులాల ఎస్‌సి వర్గీకరణపై ఆర్డినెన్స్ వచ్చిన సందర్భంగా కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు మాదిగ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జి రానా శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ విజయసారథి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల సుదీర్ఘ మాదిగ దండోరా పోరాటం వల్ల మాదిగ, ఉప కులాల ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ ఫలాలు జాతికి అందించాలని ఉద్దేశంతో అలుపెరగని పోరాటం చేసి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎంఎస్‌పి అధ్యక్షులు, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమల మాదిగ, బోస్ మన్మధరావు, జిల్లా ఎంఆర్‌పిఎస్ అధికార ప్రతినిధి కందిపాక హిమశేఖర్ మాదిగ, రాష్ట్ర మహిళా నాయకులు ఇద్దిమాల సుజాత, నక్తల రవి మాదిగ, కుర్మాన భారతి మాదిగ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్ మాదిగ


పురస్కారానికి ఎంపికైన కళాకారులు

కళాకారులకు పురస్కారం

టెక్కలి : మే నెల 10,11 తేదీల్లో ఏలూరులో సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు ఆహ్వానిస్తూ... టెక్కలికి చెందిన ముగ్గురు కళాకారులను ఎంపిక చేశారని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దూసి ఆంధ్రాస్టాలిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రపంచ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ ఛైర్మన్ కళారత్న డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆదేశాలు జారీ చేశారని అన్నారు. టెక్కలి ప్రజా చైతన్య కళాసమితి నిర్వాహకులుగా ఉన్న దూసి ఆంధ్రాస్టాలిన్, రేజేటి వెంకటరమణమూర్తి, దూసి భరత్‌లను ఆహ్వానిస్తూ... ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ప్రతాప్‌తో పాటు కన్వీనర్ కొల్లి రమావతి, ఈశ్వరీ భూషణం, పార్థసారధిలకు కళాసమితి అభినందనలు తెలుపుతూ తమ సమితికి చెందిన నిర్వాహకులు ఎంపిక కావడంపై సభ్యులు చిలుకు కృష్ణారావు, ఉత్తరకవటం గణపతి, మల్లారెడ్డి పద్మనాభం, ఆనిశెట్టి చిట్టెన్న మూల తాతయ్య, బమ్మిడి కృష్ణారావు, గౌడు మోహన్, ఆర్.రమేష్‌కుమార్, వాడాడ శ్రీనివాసరావు తదితరులు ఎంపికపై సభ్యులు అభినందించారు.


కిషోర్‌ను సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

మెళియాపుట్టి కార్యదర్శిగా కిషోర్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టి పంచాయతీ కార్యదర్శిగా కిషోర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జిగా చాపర కార్యదర్శి అప్పారావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. కార్యక్రమంలో పానిల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

దాసరి రాజుకు సన్మానం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం కొలిగాం రైల్వే అండర్ పాసింగ్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆటో యూనియన్, లారీ యూనియన్ నాయకులు, వర్తకులు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజుని శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత మూడేళ్లుగా రాజు నాయకత్వంలో చేసిన పోరాటం వల్ల అండర్ పాసింగ్ నిర్మాణం చేపట్టడానికి అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని అన్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిరసనలు, దీక్షలు చేశారని అన్నారు. హౌస్ అరెస్టులూ చేశారని, అయినా సరే పోరాటాన్ని సాగించి పట్టుపట్టి అండర్ పాసింగ్ సాధించడానికి రాజు కృషే కారణమని కొనియాడారు. అండర్ పాసింగ్ నిర్మిస్తే ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని 30 గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఉపయోగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ మోహన్, లారీ యూనియన్ ప్రెసిడెంట్ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.


రాజును సన్మానిస్తున్న యూనియన్ నాయకులు